క్లుప్తంగా

పౌష్టికాహారం సక్రమంగా పంపిణీ చేయాలి



పౌష్టికాహారాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ శెట్టి ప్రభాకర్

నంద్యాల(రూరల్): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్న పిల్లలకు సక్రమంగా పౌష్టికాహారం అందజేయాలని మండల అధ్యక్షుడు శెట్టి ప్రభాకర్ సూచించారు. గురువారం మండలంలోని రాయమాల్పురం, మునగాల, పులిమద్ది గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం చిన్నారులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఆయన మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందించాలన్నారు. పాలు, గుడ్లు తదితర వస్తువులను బయటి వ్యక్తులకు అందజేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

గృహ నిర్మాణాలు పూర్తిచేయండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ

ఉయ్యాలవాడ : గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేసేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, హౌసింగ్ ఏఈ నాగరాజు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు సూచించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడుతూ ఉగాది పండుగ నాటికి ఇళ్ల పనులు పూర్తవ్వాలని, అదే రోజు గృహ ప్రవేశాలు చేయాలని చెప్పారు. మండలానికి 962 గృహాలు మంజూరు కాగా, ఇప్పటి వరకు 287 పూర్తయ్యాయన్నారు. 72 ఇళ్లు పై కప్పు దశలో, 110 వివిధ దశల్లో కొనసాగుతున్నాయని వివరించారు.

కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



మాట్లాడుతున్న తోటమద్దులు

నంద్యాల(అర్బన్): విజయ డెయిరీలో పని చేస్తున్న కార్మికులను అకారణంగా తొలగించడం అన్యాయమని, వెంటనే తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తోట మద్దులు కోరారు. కార్మికులను విధుల్లోకి తీసుకోవాలంటూ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు గురువారం మూడో రోజుకు చేరాయి. ఆయన మాట్లాడుతూ లేబర్ అధికారులు పట్టించుకోకపోవడంతోనే ఇలాంటి సంఘటనలు జగరుతున్నాయని ఆరోపించారు. నాయకులు బాలవెంకట్, రత్నమయ్య, గౌస్, శేఖర్, ఇసాక్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఈ-నామ్ యాప్ వినియోగించుకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న నరేష్‌కుమార్ రెడ్డి

రుద్రవరం: ఎండు మిర్చి పంట సాగు చేసే ప్రతి రైతు ఈ-నామ్ యాప్‌ను వినియోగించుకోవాలని ఉద్యానవన శాఖ అధికారి నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చిలుకలూరులో గురువారం ఆయన వ్యవసాయ సిబ్బందితో కలిసి తోటబడి కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎండు మిర్చి పంట సాగు చేసే రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పంట సాగు మొదలు దిగుబడులు రావడం, వాటని ఆరబెట్టడం, విక్రయించుకోవడంపై మెళకువలు సూచించారు. ఎండు మిర్చిని నేలపై కాకుండా టార్పాలిన్ పట్టలపై అరబెట్టాలని చెప్పారు. విక్రయించు కోవాలనుకున్నప్పుడు ఈ నామ్ యాప్ ద్వారా గుంటూరు మార్కెట్‌లో ఎప్పటికప్పుడు ధర తెలుసుకోవచ్చన్నారు.

జూనియర్ న్యాయవాదులకు వరం 'లా నేస్తం'



మాట్లాడుతున్న లీగల్ సెల్ నాయకులు

నంద్యాల(వ్యవసాయం): జూనియర్ న్యాయవాదులకు లా నేస్తం వరం అని నంద్యాల జిల్లా వైఎస్సార్‌సీపీ లీగల్‌సెల్ అధ్యక్షుడు రామసుబ్బయ్య, పట్టణ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ సీఎం జగనన్న సమాజంలోని అన్ని వర్గాల వారికి సమన్యాయం చేస్తున్నారని కొనియాడారు. అనంతరం సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీనివాసులు, మురళి, ఓబుల్‌రెడ్డి, జగన్మోహన్‌రెడ్డి, తిమ్మారెడ్డి సీనియర్, జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



సాగు చేసిన వేరుశనగ



బ్లాక్‌రైస్ పైరు

ప్రకృతి సేద్యం వైపు పయనం

- సేంద్రియ వ్యవసాయంపై రైతుల చూపు
- ప్రభుత్వ ప్రోత్సాహంతో మరింత చైతన్యం
- జిల్లాలో ఏటా పెరుగుతున్న ప్రకృతి సేద్యం

గోస్పాడు: వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గించి లాభాలను పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తోంది. తక్కువ పెట్టుబడితో ఆరోగ్యకరమైన ఆహార పంట ఉత్పత్తుల లక్ష్యంగా రైతులు సరికొత్త బాట పట్టారు. ఆసక్తి ఉన్న రైతులు అధిక దిగుబడులు సాధించేలా ప్రభుత్వం అవగాహన కల్పిస్తుండటంతో జిల్లాలో ప్రకృతి వ్యవసాయం క్రమంగా విస్తరిస్తోంది. నంద్యాల జిల్లాలో గత ఏడాది 8,221 మంది రైతులు 8,463 హెక్టార్లలో ప్రకృతి సేద్యం చేయగా.. ఈ ఏడాది 11,065 మంది రైతులు 12,173 హెక్టార్లలో ఈ విధానంలో పలు పంటలు సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది 3,710 హెక్టార్ల విస్తీర్ణం పెరిగినట్లు అధికారుల ద్వారా తెలుస్తోంది. జిల్లాలో వరి, మొక్కజొన్న, మినుము, కొర్ర, సజ్జ, కంది, వేరుశనగ, శనగ తదితర పైర్లు సాగు చేశారు. డోన్ నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్నారు. గత ఏడాది 3,623 హెక్టార్లలో పైర్లు సాగు చేయగా ఈ ఏడాది 4,852 హెక్టార్లలో సాగు చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్లను నియమించింది. జిల్లాలో 300 మంది సీఆర్పీలు ఉండగా, ఒక్కొక్కరికీ రూ.9వేలు గౌరవ వేతనం అందిస్తోంది. వీరు సేంద్రియ వ్యవసాయం చేసే రైతులకు సరైన సమయంలో సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ప్రకృతి సేద్యం పద్ధతిలో పంటలు సాగు చేసే రైతుల సంఖ్య క్రమేణా పెరుగుతోంది. ఈ పద్ధతిలో కొంత దిగుబడులు తగ్గినా రైతులకు లాభసాటిగానే ఉంది. కాలక్రమేణ ప్రజల్లో ఆరోగ్యంపై శ్రద్ధ పెరగడంతో పాటు ఆహారపు అలవాట్లు కూడా క్రమంగా మారి ప్రకృతి సేద్యం పంట ఉత్పత్తులకు ఆదరణ పెరుగుతోంది. దీంతో రైతులకు గిట్టుబాటు ధర లభించి లాభాలు చూస్తున్నారు.

జిల్లాలో ప్రకృతి సేద్యం వివరాలు (హెక్టార్లలో)

నియోజకవర్గం	2021-22లో	2022-23లో
నంద్యాల	1,689	2,678
ఆళ్లగడ్డ	1,454	2,352
ఆత్మకూరు	371	644
డోన్	3,623	4,852
కోవెలకుంట్ల	734	921
నందికొట్కూరు	592	726

20 ఎకరాల్లో సాగు చేస్తున్నా



ప్రకృతి వ్యవసాయం కింద ఐదేళ్లుగా వివిధ పైర్లను సాగు చేస్తున్నా. గతంలో రసాయన ఎరువులు, పురుగు మందులు వాడి వరి, వేరుశనగ, కంది, మినుము, పొద్దుతిరుగుడు సాగు చేసేవాళ్లం. పెట్టుబడి పెరగడం, దిగుబడులు తగ్గడంతో నష్టాల నుంచి గట్టెక్కేందుకు కష్టంగా ఉండేది.

అధికారులు ప్రకృతి సేద్యంపై అవగాహన కల్పించడంతో ప్రస్తుతం 20 ఎకరాల పొలంలో ప్రధాన పంట మామిడి, అంతర్ పంటలుగా టమాట, వేరుశనగ, కంది తదితర పైర్లను సాగు చేశా. గతంలో కంటే ఇప్పుడు వచ్చే పంటలు గిట్టుబాటు అవుతున్నాయి. ఆవు పేడ, ఆవు మూత్రం, వేపాకులతో (నీమాస్త్రం), జీవామృ వాన్ని వినియోగిస్తూ ఎలాంటి రసాయనిక మందులు వాడకుండానే పైర్లను సాగు చేస్తున్నాను.

– పద్మనాభయ్యశెట్టి, రైతు, ఓబులాపురం

దేశ వాళీ పంటలతో లాభాలు



వ్యవసాయంలో రసాయన ఎరువులు, మందులు, పురుగు మందులను వాడకంతో పెట్టుబడి చాలా ఉంటుంది. ఏడాది పొడవునా కష్టపడినా దిగుబడి సరిగా లేక, అరకొర పంటకు మార్కెట్లో ధర లేక పోవడంతో పెద్దగా గిట్టుబాటు ఉండదు. ప్రకృతి వ్యవసాయంపై ఆలోచించి దేశవాళీ రకాలైన బ్లాక్‌రైస్, రెడ్‌రైస్, చిట్టి ముత్యాలు తదితర ఏడు ఎకరాల వరిని ప్రకృతి వ్యవసాయ విధానంలో సాగు చేశా. మూడేళ్ల క్రితం ఈ విధానాన్ని అనుసరించి ఎకరా పొలంలో మొదటగా ప్రయత్నించి లాభాలు పొందడంతో అలాగే ముందుకెళ్తున్నాను. రసాయన ఎరువు, పురుగు మందుల ధరలతో పోలిస్తే పెట్టుబడి చాలా తక్కువ. మార్కెట్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన ధాన్యానికి ఆదరణ ఉండటంతో పాటు మంచి లాభాలు కూడా వచ్చాయి.

– మద్దిలేటి, జిల్లెల్ల, గోస్పాడు

అవగాహన పెరుగుతోంది



ప్రకృతి సేద్యంపై రైతుల్లో అవగాహన పెరుగుతోంది. ఈ ఏడాది నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. ప్రధాన పంటలతో పాటు అంతర్ పంటల సాగు, ఎర్ర పంటలు రక్షక పంటలు, లింగాకర్షణ బుట్టలు, జిగురు అట్టలు, పక్షి స్థావరాలు వంటి రాజీలేని సూత్రాలు పాటించడంతో పైర్లకు క్రిమికీటకాల బెడద నుంచి ఉపశమనం చేకూరి రైతులకు ప్రయోజనంగా ఉంటుంది. జిల్లాలో ప్రకృతి వ్యవసాయం కింద రైతులకు ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తున్నాం.

– నరేంద్రారెడ్డి, ప్రాజెక్టు మేనేజర్, నంద్యాల

రాష్ట్రాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



పనుల వివరాలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితోనే సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రమైన గోస్పాడులో మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమంలో భాగంగా గృహ సారథులకు శిక్షణ సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టాక మునుపెన్నడూ చూడనన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని పలు హామీలను కూడా చేసి చూపెడుతున్నారన్నారు. ప్రజలతో మమేకమై ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలను గ్రామ స్థాయిలో ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతం చేయాలని సూచించారు. వీటితో పాటు టీడీపీ పాలన, వైఎస్సార్‌సీపీ పాలనలోనున్న తేడాలను వివరించాలని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రజల్లో ఉన్న ఆదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నాలు చేస్తున్నాయని, వాటిని తిప్పికొట్టాలన్నారు. అనంతరం గృహ సారథుల బాధ్యతలు, విధివిధానాలపై పలు సూచనలు చేశారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంగా చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి, మాజీ ఎంపీపీ రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, ఉపాధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, రాజు, సర్పంచులు శకుంతలమ్మ, కోటేశ్వరరెడ్డి, రాజారెడ్డి, ప్రసాద్, పుల్లయ్య, బజయ్య పాల్గొన్నారు.

నీటి సమస్య పరిష్కారానికి చర్యలు

నంద్యాల(సిటీ): పట్టణంలో నీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద మోటార్ వాటర్ కనెక్షన్ల పనులు, పైప్ లైన్‌లు, ట్యాంకులు, హారిజాంటల్ డ్రిల్లింగ్ పనులను మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి, అమృత్ ప్రాజెక్ట్ మేనేజర్ సురేష్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం పనుల పురోగతిని తెలుసుకుని పలు సలహాలు, సూచనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలో ఏ వార్డులో కూడా తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. సురేష్ మాట్లాడుతూ 20 రోజుల్లోగా పనులు పూర్తి చేసి వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సమస్యలపై అవగాహన అవసరం



ఆహారాన్ని పరిశీలిస్తున్న కాంతారావు నాయక్

గోస్పాడు: ఆరోగ్య సమస్యలపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని నంద్యాల జిల్లా ఇన్‌చార్జ్ కో ఆర్డినేటర్ డాక్టర్ కాంతారావు నాయక్ తెలిపారు. రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం నిర్వహణలో భాగంగా గురువారం మండలంలోని పసురుపాడు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. ఆరోగ్య సిబ్బంది విద్యార్థులకు ప్రతి గురువారం చేస్తున్న ఆరోగ్య పరీక్షలు, ఐరన్, ఫోలిక్ ఆసిడ్, పింక్ రంగు మాత్రలు మింగించడం, విద్యార్థులకు చేసిన హిమోగ్లోబిన్ పరీక్షల వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, ప్రతి గురువారం తప్పనిసరిగా ఒక ఐరన్ ఫోలిక్ ఆసిడ్ పింక్ రంగు మాత్ర మధ్యాహ్నం భోజనం తరువాత మింగాలని విద్యార్థులకు సూచించారు. మధ్యాహ్న భోజనం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం స్వచ్ఛ భారత్, నాడు-నేడు కింద నిర్మించిన టాయిలెట్స్, తాగునీటి సౌకర్యం, ఆవరణ, విద్యార్థులు భోజనం చేసే పరిసరాలు పరిశీలించారు.

సంక్షిప్తం

● జయప్రదం చేయండి

నంద్యాల(అర్బన్): ఈ నెల 25వ తేదీన విజయవాడలో ఆదివాసీల హక్కులు, అటవీ సంపద పరిరక్షణకు కోసం జరిగే రాష్ట్ర సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ డివిజన్ కార్యదర్శి శంకర్ కోరారు. స్థానిక కార్యాలయంలో గురువారం ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు.

● ఆర్‌బీకేల్లో జొన్నల కొనుగోళ్లు

దొర్నిపాడు: ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో జొన్నలు కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని డబ్ల్యూ గోవిందిన్నె, డబ్ల్యూ కొత్తపల్లె, గుండుపాపల గ్రామాల్లోని ఆర్బీకేలను తనిఖీ చేశారు. ఒక్కో రైతు నుంచి 20–100 క్వింటాళ్ల వరకు కొనుగోలు చేస్తారని చెప్పారు.

ఆళ్లగడ్డ: చిరుధాన్యాల పంటల కొనుగోలులో భాగంగా జొన్నలను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మండల వ్యవసాయాధికారి కిశోర్‌కుమార్‌రెడ్డి తెలిపారు.

● ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

శిరివెళ్ల: యర్రగుంట్ల జీటీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ ఇంటర్‌లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీనివాసులు గురువారం తెలిపారు. ఇంటర్ చదువుతూ మధ్యలో చదువు మానివేసిన వారికి ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందన్నారు. ఆసక్తి గల వారు ఈ నెల 27వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో రిజిష్టర్ చేసుకున్న కాపీని కళాశాలలో అందచేయాలని సూచించారు.

ఆళ్లగడ్డ: ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు ఈ నెల 27వ తేదీ వరకు గడువు ఉందని వైపీపీఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామసుబ్బన్న గురువారం తెలిపారు.వివరాలకు ఆళ్లగడ్డ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సంప్రదించాలని ఆయన కోరారు.

● ఇద్దరికి 'లా నేస్తం'

శిరివెళ్ల: మండలంలో కొత్తగా ఇద్దరికి లా నేస్తం మంజూరైందని ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. స్థానిక బలిజపేటకు చెందిన దాదిరెడ్డి మౌనిక, గండంపాడుకు చెందిన గుల్లకుంట శ్రీకాంత్‌కు మంజూరైందని చెప్పారు. ఇప్పటికే మండలంలో నలుగురు లా నేస్తం కింద లబ్ధి పొందుతున్నారన్నారు. వీరికి నెలకు రూ.5 వేల ప్రోత్సాహం అందుతుందని పేర్కొన్నారు.

● పేర్లు నమోదు చేసుకోండి

శిరివెళ్ల: జొన్న సాగు చేసిన రైతులు ఆర్బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఏఓ సుధాకర్ గురువారం తెలిపారు. ప్రభుత్వం ఈ రబీలో సాగు చేసిన జొన్న దిగుబడికి మద్దతు ధర కల్పించిందన్నారు.

● 25 నుంచి స్పెషల్ డ్రైవ్

నంద్యాల(రూరల్): పట్టణంలోని డీ-2 విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 25వ తేదీ నుంచి పెండింగ్ విద్యుత్ బిల్లులపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఏఈ రామయ్య గురువారం తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని వినియోగదారులు ఈ నెల 24వ తేదీ లోపు బిల్లులు చెల్లించాలని చెప్పారు. లేకపోతే 25వ తేదీ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని స్పష్టం చేశారు.

● వ్యక్తి ఆత్మహత్య

రుద్రవరం: చిన్నకంబలూరుకు చెందిన తిరుపతిరెడ్డి (45)అనే వ్యక్తి పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్‌ఐ నిరంజన్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. తిరుపతి రెడ్డి కొంత కాలంగా మద్యానికి బానిసై కూలి సొమ్మును తాగుడుకు ఖర్చు చేసేవాడు. దీంతో ఆరోగ్యం దెబ్బతిన కూలీ పనులకు వెళ్లలేకపోయాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది గురువారం తెల్లవారు జామున పురుగు మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని భార్య,కుమారుడు గమనించి నంద్యాలకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండటంతో కర్నూలుకు తరలిస్తుండగా మధ్యలో మృతి చెందాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

సామాజిక న్యాయం గురించి టీడీపీ మాట్లాడటమా?

- నాడు బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూశారు
- వారిని బ్యాక్‌బోన్‌గా మార్చిన ఘనత సీఎం జగన్‌దే
- నాటికీ, నేటికీ తేడాను గుర్తించండి
- మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీపీ నాగిరెడ్డి

నంద్యాల: సామాజిక న్యాయం గురించి టీడీపీ మాట్లాడటం హాస్యాస్పదమని, ఆ పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే గుర్తించిందని, ఏనాడు వారికి ప్రాధాన్యత ఇచ్చి, వారి అభ్యున్నతికి కృషి చేయలేదని రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ పీపీ నాగిరెడ్డి అన్నారు. బీసీలను బ్యాక్‌బోన్‌గా అభివరించి పదవి చేపట్టిన నాటి నుంచి నేటి ఎమ్మెల్సీ అభ్యర్థుల వరకు అధిక శాతం వారికే ప్రాధాన్యతనిచ్చిన తీరు అభినందనీయమన్నారు. పట్టణంలోని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి నివాసంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ సామాజిక న్యాయం చేస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం 18 ఎమ్మెల్సీ స్థానాలకు గాను 14 సీట్లు బీసీ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకే కేటాయించింది కనిపించడం లేదా అని ప్రశ్నించారు. నాడు మండలిలో టీడీపీకి 48 మంది సభ్యులుంటే బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చెందిన వారు 18 మంది మాత్రమే ఉన్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఏ ఎన్నికలు జరిగినా, నామినేటెడ్ పదవులు సైతం అన్ని వర్గాలకు కేటాయిస్తూ సమన్యాయం చేస్తూ సామాజిక న్యాయ నిర్మాతగా సీఎం జగన్ నిలుస్తున్నారని కొనియాడారు. ఇంతకాలం కేవలం పల్లకీ మోసే వారని, వారిని గుర్తించి రాజకీయ పదవులు కల్పించి చరిత్రలో నిలిచారన్నారు. రాష్ట్రంలో ప్రతి పక్ష పార్టీ అవలంబిస్తున్న తీరును ప్రజలు గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని సూచించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి ముందుకు సాగుతుంటే బురదజల్లే రాజకీయాలకు పాల్పడటం సరికాదన్నారు. ఇప్పటికైనా అభివృద్ధికి సహకరించి ప్రజలకు మంచి చేయడానికి ముందుకు రావాలని హితవు పలికారు. చంద్రబాబు అధికారంలో ఉన్నప్పుడు గుర్తురాని సామాజిక న్యాయం తాము అన్ని వర్గాలకు ప్రాధాన్యతనిస్తున్నా ఓర్వలేక ఆరోపణలు చేయడం దారుణమన్నారు. నాయకులు కోటేశ్వరరెడ్డి, సోమశేఖరరెడ్డి, నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ నివారణకు లయన్స్, ఐఎంఏ ఒప్పందం



డయాబెటిస్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

నంద్యాల(వ్యవసాయం): రాష్ట్ర వ్యాప్తంగా పట్టణాలు, నగరాలు, గ్రామీణ ప్రాంతాల్లో మధుమేహ వ్యాధి గుర్తింపు, నివారణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించడానికి అంతర్జాతీయ లయన్స్‌కు అనుబంధంగా ఉన్న ఆంధ్రప్రదేశ్ లయన్స్ డయాబెటీస్ ఫౌండేషన్, రాష్ట్ర ఐఎంఏ శాఖ గురువారం ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. డయాబెటిస్ అవగాహ నడక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ రఘువీర్ రెడ్డి ప్రారంభించారు. అంతర్జాతీయ లయన్స్ సేవా ఫౌండేషన్ ప్రతినిధి విజయ్‌కుమార్ రాజు మాట్లాడుతూ ఫౌండేషన్ ద్వారా రాష్ట్రంలో డయాబెటిస్ నివారణకు ప్రత్యేక నిధులు కేటాయించి అవసరమైన పరికరాలు సమకూరుస్తామని చెప్పారు. ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రవికృష్ణ మాట్లాడుతూ వ్యాధి విస్తృత స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో నివారణ చర్యలు ముఖ్యంగా అవగాహన కార్యక్రమాలు, వ్యాధి నిర్ధారణ శిబిరాలు దశల వారీగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో చేపడతామని తెలిపారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ డయాబెటిస్ నివారణకు పూనుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్లు రామచంద్ర ప్రకాశ్, గోపీచంద్, మంగతాయారు, ఉషారాజు, డాక్టర్ చంద్రశేఖర్, కృష్ణంరాజు, ప్రసాద్, శివ శంకర్, చిన్నపురెడ్డి పాల్గొన్నారు.

గ్రీవెన్స్ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడిగా రామసుబ్బయ్య



నంద్యాల(వ్యవసాయం): నంద్యాల జిల్లా అడ్వకేట్, గ్రీవెన్స్ లీగల్ సెల్ అధ్యక్షుడుగా కూకుట్ల రామసుబ్బయ్యను తిరిగి ఎన్నుకున్నారు. రామసుబ్బయ్య మాట్లాడుతూ జిల్లాలో వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానన్నారు. జిల్లాలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు న్యాయ సేవలు అందించి, బాధితులకు అండగా నిలుస్తానని చెప్పారు. ఈ బాధ్యతలు అప్పజెప్పిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషాకు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ లీగల్ సెల్ అధ్యక్షుడు ప్రతాప్‌రెడ్డి, విజయశేఖర్‌రెడ్డి, జగన్‌మోహన్‌రెడ్డి,ముక్కెర కృష్ణారెడ్డి, పెద్ది శ్రీనివాసులు, పెద్ద స్వామి, సుబ్బరాయుడు, కృష్ణ అభినందనలు తెలిపారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా జగనన్న పాలన



ఎమ్మెల్యే సమక్షంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన దృశ్యం



చాగలమర్రిలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

ఆళ్లగడ్డ: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన కొనసాగుతోందని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. చాగలమర్రి మండలం ముత్యాలపాడులో గురువారం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు బండి ఓబులేసు, విశ్వనాథ్, నరసయ్య, లక్ష్మీనరసయ్య, బాబు, చిన్నమస్తానయ్య, జమాల్, లడ్డుశ్రీను, నరస్పయ్యలతో పాటు సుమారు 20 కుటుంబాలు ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బాబూలాల్, కుమార్‌రెడ్డి, రఫీ, రమేష్, దస్తగిరి, గోవిందయ్య పాల్గొన్నారు.

అసత్య కథనాలు సరికాదు

ప్రజాసేవే లక్ష్యంగా, ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై పచ్చ మీడియా అసత్య కథనాలు రాయడం మానుకోవాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ నాయకుడు పట్టాభిని పోలీసులు కొట్టారని, పాత ఫొటోతో తప్పుడు వార్తలు ప్రచురించి ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసిన ఈనాడు దినపత్రిక తీరును తప్పుబట్టారు. అనంతరం చాగలమర్రిలో భారీ నిరసన ర్యాలీ చేపట్టి ఈనాడు ప్రతులను దహనం చేశారు.

రైతులకు అండగా ఉంటాం

దొర్నిపాడు: దిగుబడి దగ్ధంలో నష్టపోయిన రైతులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం రాత్రి మండలంలోని డబ్ల్యూ.గోవిందిన్నె గ్రామానికి చెందిన జాకీర్‌బాషా, నాగేంద్రకు చెందిన జొన్న దిగుబడికి నిప్పు పెట్టడంతో కాలిపోయిన పంటను ఎమ్మెల్యే పరిశీలించి బాధిత రైతులను ఓదార్చారు. 8 ఎకరాల్లో సాగు చేశామని, 160 క్వింటాళ్ల జొన్నలు అవుతాయని సంతోష పడ్డామని, ఈలోపు ఇలా జరిగిందని వాపోయారు. అధికారులతో మాట్లాడి ప్రభుత్వం నుంచి నష్టపరిహారం వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు, దొర్నిపాడు సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి, నాయకులు మోహన్‌నాయుడు ఉన్నారు.

తప్పుడు రాతలను సహించం



ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న దృశ్యం

నంద్యాల(సిటీ): తప్పుడు రాతలు రాస్తూ సమాజానికి అవాస్తవాలను చేరవేసే ఈనాడు పత్రికకు ప్రజలు స్వస్తి చెబుతారని నంద్యాల మున్సిపల్ వైస్ చైర్మన్లు పాంశావలి, గంగిశెట్టి శ్రీధర్, బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ అన్నారు. గురువారం స్థానిక శ్రీనివాస సెంటర్‌లో తప్పుడు వార్తలు రాసిన ఆ పత్రిక ప్రతులను దహనం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తప్పుడు కథనాల ద్వారా టీడీపీ అధినేతకు ఈనాడు పత్రికతో ఉన్న అనుబంధం ప్రజలందరికీ తెలిసిపోయిందన్నారు. విలువలకు తిలోదకాలిచ్చి కేవలం టీడీపీకి మేలు చేసేలా రాతలు రాయడం దుర్మార్గమన్నారు. పాత ఫొటోతో పట్టాభి వార్తను ప్రచురించడం మీ నైతికతను తెలియజేస్తుందని మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలు తగిలి గేదెలు మృతి

నంద్యాల(అర్బన్): అబాండం తండా సమీపంలో పాలేరు వాగులో మేత కోసం వచ్చిన రెండు పాడి గేదెలు విద్యుత్ తీగలు తగిలి మృత్యువాత పడ్డాయి. మండలంలోని పెద్దకొట్టాల గ్రామానికి చెందిన రైతు షేక్ నూర్ అహమ్మద్ గేదెలు మేపుకునేందుకు పాలేరు వాగుకు వచ్చాడు. పశులువు మేస్తూ వేలాడుతున్న విద్యుత్ తీగలను తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందాయి.రైతు మాట్లాడుతూ తీగలను సరిచేయాలని గతంలో పలుమార్లు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. మృతి చెందిన గేదెలకు నష్టపరిహారం అందించాలని కోరాడు.

వ్యక్తిపై దాడి

బొమ్మలసత్రం: నంద్యాల పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపంలో రామకృష్ణ అనే వ్యక్తిపై గుర్తు తెలియని దుండగుడు పదునైన ఆయుధంతో దాడి చేసి పరారయ్యాడు. త్రీటౌన్ సీఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. తెలంగాణ రాష్ట్రం అప్పన్న గుర్తి గ్రామానికి చెందిన రామకృష్ణ వారం క్రితం ఓంకారం క్షేత్రంలో వంట పని చేసేందుకు వచ్చాడు. పని ముగించుకొని గ్రామానికి వెళ్లేందుకు స్థానిక రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాడు. ఈ సమయంలో గుర్తు తెలియని దుండగుడు పదునైన ఆయుధంతో దాడి చేసి పారిపోయాడు. గాయపడిన రామకృష్ణను స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.